జీతాలివ్వకుంటే బతికేదెట్లా?

- దుర్భరంగా పంచాయతీ కార్మికుల బతుకులు
- బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే నాలుగైదు నెలల పెండింగ్
- కాంగ్రెస్ సర్కారు వచ్చినంకా అందని జీతాలు
- నేడు పంచాయతీరాజ్ కమిషనరేట్‌ను ముట్టడించనున్న జిపి కార్మికులు



ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇచ్చే జీతమే రూ.9,500. ఆపైన ఇద్దరి జీతాన్ని ముగ్గురు పంచుకోవడం. ఆ అరకొర జీతం చెల్లింపులోనూ తీవ్ర జాప్యం. ఒక జిల్లాలో మూడు నెలలు..మరో జిల్లాలో ఆరు నెలలు..ఇంకో జిల్లాలో ఎనిమిది నెలలు...అక్కడక్కడా 12 నెలల నుంచి జీతం అందని దౌర్భాగ్యం. చెత్త ఎత్తేటోళ్లు..మోరీలు తీసేటోళ్లు, చెప్పింది చేసి పడుండేటోళ్లు, వాళ్లే చేస్తారులే అనుకున్నారో ఏమోగాని పాలకులు వ్యవహరిస్తున్న తీరు దారుణం. జీతం ఇగొస్తదేమో, అగొస్తదేమో అని కండ్లు కాయలు కాసేలాగా ఎదురుచూస్తున్న పంచాయతీ కార్మికులు ఉద్యమబాట పడుతున్నారు. పెండింగ్ జీతాల విడుదల, మల్టీపర్పస్ విధానం రద్దు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఎంపిడిఒలకు, డిపిఒలకు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలిచ్చినా పరిష్కారం కాకపోవడంతో పంచాయతీ కార్మికులంతా గురువారం నాడు హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌ను ముట్టడికి పిలుపునిచ్చారు. సమ్మెకాలంలో కాంగ్రెస్ నేతలు తమ వెన్నంటే ఉన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు కాబట్టి తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు వేతనాల సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో విధంగా వేతన సమస్య ఉంది. 23 జిల్లాల్లో 6 నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందట్లేదు. తొమ్మిది జిల్లాల్లో మూడు నుంచి నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా ఐదేసి పంచాయతీ కార్మికులు ఎంపిడిఒ, డిపిఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు, పోరాటాలు చేశారు. దీంతో ఉన్నతాధికారులు దిగొచ్చి ప్రస్తుతం మూడు నెలల జీతాలను విడుదల చేశారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలంలోని పంచాయతీల్లో ఎనిమిది నుంచి 12 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేశంపల్లి మండలంలోనూ ఎనిమిది నెలలుగా జీతాల్లేవు. అదే జిల్లాలోని పెద్దవూర మండలంలోని పెరిగిన వెయ్యి రూపాయల వేతనాన్ని ఇవ్వడం లేదు. అడిషనల్ కలెక్టర్ పెరిగిన వేతనాలు ఇవ్వాలని అధికారులకు చెప్పినా ఆచరణలో అమలు కావడం లేదు. ఇలా అన్ని జిల్లాల్లోనూ వేతనాల చెల్లింపు విషయంలో ఏదో ఒక సమస్య ఉంది. ఇదేంటని అడిగితే ఇష్టముంటే చేయండి లేకుంటే వెళ్లిపోండి అని అధికారులు హూంకరిస్తున్న పరిస్థితి నెలకొంది. కుటుంబం గడవక ఇండ్లల్లో గొడవలు జరిగి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలో నలుగురు కార్మికులు పనిబంద్ పెట్టేశారు. నల్లగొండ జిల్లా వెలిగొండ మండలంలోనూ జీతాలు రాక నలుగురు కార్మికులు విధులకు రావడం లేదు. ఏనాటికైనా తమ కొలువు పర్మినెంట్ అవుతుందనే ఆశతో వికారాబాద్ జిల్లాలో జీతం రాకున్నా ఓ కార్మికుడు పనిచేశాడు. శాలరీ రాకుండా ఎన్ని నెలలు గడుపుతావు? కుటుంబం పరిస్థితేంటి? అంటూ ఇంటి నుంచి ఆయన భార్య వెళ్లిపోయారు.. ఇవి మనకు తెలిసిన కొన్ని ఉదహరణలు మాత్రమే. జీతాలు రాకుండా ఇబ్బందులు పడుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మల్టీపర్పస్ విధానం ఎందుకొద్దంటున్నారంటే

బిఆర్ఎస్ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానంలో కార్మికులు పనిచేయాలనే నిబంధన తీసుకొచ్చింది. ఇది కార్మికులను పొట్టనబెట్టుకుంటున్నది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామంలో బతుకమ్మ పండుగ సమయంలో చెరువులో దిగి పనిచేస్తుండగా ముగ్గురు కార్మికులు అందులో పడి చనిపోయారు. సంబంధం లేని పనిచేయటం వారిని కుటుంబానికి దూరం చేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం చుక్కాలబోడు గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశం అనే కార్మికుడికి ఎలక్ట్రిషియన్ పనిరాదు. అధికారుల ఒత్తిడితో కరెంటు స్తంభం ఎక్కి పనిచేస్తుండగా విద్యుద్ఘాతంతో చనిపోయాడు. ఇప్పుడు ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడింది. సిద్దిపేట జిల్లా తొగుట మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన మహేందర్ అనే కార్మికుడు కూడా విద్యుద్ఘాతానికి గురై చెయ్యి, కాలు కోల్పోయి ఏ పనీ చేయలేని పరిస్థితిలో ఉన్నాడు. నల్లగొండ జిల్లా మాడుగుల పల్లి మండలం కన్నెగల్లుకు చెందిన పంచాయతీ కార్మికుడు జి.నరేశ్ కూడా విద్యుద్ఘాతంతో చనిపోయాడు. ట్రాక్టర్ ప్రమాదాల్లోనూ పలువురు కార్మికులు చనిపోయారు. ఇలా ఎందరో కార్మికులు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. అధికారులు దారుణంగా వ్యవహరిస్తూ కాలొర్బాలతోనూ మోరీలు తీయిస్తున్నారు. మెదక్ జిల్లా ఏడుపాయల జాతర సందర్భంగా జిల్లాలోని 21 మండలాల సిబ్బంది అక్కడ పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వారితో సంబంధం లేని పనులు చేయించి రోజుకు రూ.300 ఇచ్చి వెళ్లగొట్టారు. ఇలా సంబంధం లేని పనిచేయించడం, అధికారుల ఒత్తిడితో రాని పని చేసి ప్రాణాలు కోల్పోతుండటంతో పంచాయతీ కార్మికులు మూకుమ్మడిగా వీటిని వ్యతిరేకిస్తున్నారు.

11 నెలల నుంచి జీతం వస్తలేదు.

నీల ఆంజనేయులు, తేనేపల్లి గ్రామం, గుర్రంపోడు మండలం, నల్లగొండ జిల్లావాటర్‌మెన్‌గా పనిచేస్తున్నా. 11 నెలల నుంచి జీతమొస్తలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా బాధలు ఎవ్వరికీ చెప్పుకోలేకపోతున్నాం. పనిచేసేదాని కంటే ఎక్కడికన్నా వెళ్లిపోవాలనిపిస్తున్నది. కానీ, ఎప్పటికైనా పర్మినెంట్ కాకపోతుందా? అన్న ఆశతోనే బాధలను ఓర్చుకుని పనిచేస్తున్న. దయచేసి కాంగ్రెస్ ప్రభుత్వం దయతలచి వెంటనే వేతనాలు ఇప్పించాలి. మాతోని అన్ని పనులు చేయించుకోవడం సరిగాదు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయించాలి.

అప్పుసప్పులు చేసి సంసారం ఎల్లదీస్తున్నం

- ఫిదాకుల కోటయ్య, నల్లగొండ జిల్లా

వచ్చేదే చాలీచాలని వేతనం. ఏడునెలల నుంచి ఇస్తలేరు. అప్పుసప్పులు చేసి సంసారం ఎల్లదీస్తున్నం. సేవలు చేయించుకుంటూ జీతాలివ్వకపోవడంతో జీవితాలు బజారునపడ్డాయి. వెంటనే వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయించి ఆదుకోవాలి. అన్ని పనులు సక్కగ రాకున్నా మల్టీపర్పస్ పేరుతో మాతో పని చేయిస్తున్నారు. మా మండలంలో జానయ్య అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్ పనిచేసేవాడు. డ్రైవింగ్ సరిగా రాకున్నా అతనితో బలవంతంగా ట్రాక్టర్ నడిపించడం వల్ల బోల్తా పడి చనిపోయాడు. ఇయ్యాల ఆయన కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదు. అందుకే ప్రమాదబీమా రూ.10 లక్షలు అమలు చేయాలని కోరుతున్నాం. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి. సీనియార్టీ ప్రకారం పర్మినెంట్ చేయాలి.

డాక్టర్ త్రిపుర సుందరి మరణం తీరనిలోటు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా వైద్యులు డాక్టర్ త్రిపుర సుందరి మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు సంతాపం ప్రకటించారు. బుధవారం ఆమె అంత్యక్రియలకు డిజితోపాటు హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ హాజరై నివాళులర్పించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా డిజి మాట్లాడుతూ త్రిపుర సుందరి నెల్లూరు, గుంటూరు ప్రజా వైద్యశాలల్లో చాలా కాలం పాటు పేద రోగులకు వైద్య సేవలందించారని చెప్పారు. ఆమె తన చివరి రోజుల వరకు కమ్యూనిస్టు అభిమానిగా ఉంటూ తన వంతు సహాయ సహకరాలు అందించారని అన్నారు. ఆమె మరణం పేదలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి గారూ.... రైతులంటేే.. మీకు ఎందుకంత చిన్నచూపు..?

- కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

' రైతులంటే మీకు ఎందుకంత చిన్నచూపు?' అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. పంటలు ఎండుతున్నా పట్టించుకోవటం లేదు..వడగండ్లు ముంచెత్తినా సిఎం కన్నెత్తి చూడటం లేదని విమర్శించారు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు తప్ప.. గల్లీలో రైతుల కన్నీళ్లు కనిపించవా? అన్నదాతల ఆర్తనాదాలు ప్రభుత్వానికి వినిపించవా? అని నిలదీశారు. ఎన్నికల గోల తప్ప.. ఎన్నో కష్టాలు పడుతున్న రైతులపై కనికరం లేదా? సీట్లు, ఓట్ల పంచాయతీ తప్ప.. అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా..? అంటూ సిఎంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజా పాలన అంటే.. 24/7 పాటు ఫక్తు రాజకీయమేనా? పార్టీ ఫిరాయింపులపై ఉన్న దృష్టి.. పంటనష్టంపై లేదెందుకు? పాడైపోయిన పంటలను పరిశీలించే తీరిక లేదా? హైకమాండ్ చుట్టూ చక్కర్లు కొట్టీ కొట్టీ.. రైతుల సమస్యలు వినే ఓపిక లేదా? అంటూ ప్రభుత్వ వైఖరిని తప్పుపట్టారు. "ఇంతకాలం పచ్చని పైర్లు ఎండుతున్నా సాగునీరు ఇవ్వడం చేతకాలేదు ఇప్పుడు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వటానిక మనసు రావడం లేదా? గుర్తు పెట్టుకోండి! ఎద్దేడ్సిన ఎవుసం! రైతేడ్సిన రాజ్యం బాగుండదు అని సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలకు జరుగుతున్న అన్యాయంపై.. భారత "రైతు" సమితి.. పోరాడుతూనే ఉంటది!" అని హెచ్చరించారు.

ట్రస్ట్ ఫిన్‌టెక్ ఐపిఒ ధరల శ్రేణీ నిర్ణయం

హైదరాబాద్ : ఫిన్‌టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ ట్రస్ట్ ఫిన్‌టెక్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) ధరల శ్రేణీని ప్రకటించింది. ఈ సంస్థ ఇష్యూ మార్చి 26న ప్రారంభమై.. 28తో ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం శుక్రవారం ఇష్యూను తెరవనుంది. షేర్ల ధరల శ్రేణీని రూ.95-101గా నిర్ణయించింది. ఈ ఇష్యూలో రూ.10 ముఖ విలువ కలిగిన 62.82 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. దీంతో రూ.63.45 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం ఒక్క లాట్‌లో 1200 ఈక్విటీ షేర్లకు బిడ్డింగ్ వేయాల్సి ఉంటుంది.

ఎవెరెడీ బ్యాటరీలకు నీరజ్ చోప్రా ప్రచారం

హైదరాబాద్ : బ్యాటరీ తయారీల సంస్థ ఎవెరెడీ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ (ఇఐఎల్) ఒలింపిక్ జావెలిన్ బంగారు పతక విజేత నీరజ్ చోప్రాను తమ నూతన బ్రాండ్ అంబాసీడర్‌గా నియమించుకుంది. తమ సరికొత్త అల్టిమా ఆల్కలీన్ బ్యాటరీ సిరీస్‌కు ప్రచారాన్ని కల్పించనున్నారని ఆ సంస్థ పేర్కొంది. చోప్రా అసాధారణ ప్రయాణం తమ బ్రాండ్ విస్తరణకు అద్దం పడుతుందని ఇఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనిర్బన్ బెనర్జీ పేర్కొన్నారు.

ఏషియన్ గ్రానిటో ప్రచారకర్తగా రణబీర్

న్యూఢిల్లీ : ప్రముఖ టైల్స్, మార్బుల్స్ కంపెనీ ఏషియన్ గ్రానిటో ఇండియా లిమిటెడ్ (ఎజిఎల్) తన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్‌ను నియమించుకుంది. రణబీర్ ఆకర్షణ, బహుముఖ ప్రజ్ఞ తమ సంస్థ స్ఫూర్తిని సరిగ్గా ప్రతిబింబిస్తాడని ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది. రణ్‌బీర్‌తో కలిసి త్వరలోనేప్రచారప్రకటనలను ఆవిష్కరించను న్నామని ఎజిఎల్ ఎండి కమలేష్ పటేల్ పేర్కొన్నారు.


గెలాక్సీ ఎ55, ఎ 35 5జి ఫోన్ల విడుదల

- స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో 18% వాటా
- సామ్‌సంగ్ వెల్లడి

హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా గెలాక్సీ ఎ55 5జి, గెలాక్సీ ఎ35 5జిని ఆవిష్కరించింది. బుధవారం హైదరాబాద్‌లో వీటిని సామ్‌సంగ్ ఇండియా ఎంఎక్స్ బిజినెస్ సీనియర్ డైరెక్టర్ ఘూఫ్రాన్ ఆలం మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో సామ్‌సంగ్ 18 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉందన్నారు. 5జి మొబైల్ విక్రయాల్లో 75 శాతం వృద్ధిని కనబర్చుతుందన్నారు. 5జి విభాగంలో 21 శాతం మార్కెట్ వాటా ఉందన్నారు. గెలాక్సీ ఎ55 5జి ఫోన్ల ధరల శ్రేణీ రూ.36,999-42,999గా, ఎ35 5జి ధర రూ.27,999- 30,999గా నిర్ణయించామన్నారు.

టికె ఎలివేటర్లతో అత్యాధునిక మొబిలిటీ పరిష్కారాలు

న్యూఢిల్లీ : తమ సంస్థ అత్యాధునిక మొబిలిటీ పరిష్కారాలను అందిస్తుందని టికె ఎలివేటర్ ఇండియా సిఇఒ, ఎండి మనీష్ మెహన్ పేర్కొన్నారు. దేశంలో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం ద్వారా వృద్ధికి సహకరించడానికి దృఢంగా కట్టుబడి ఉన్నామన్నారు. భారత్‌లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రజలకు సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇందు కోసం 2017లో పూణెలో సమీపంలోని చకన్‌లోని ఆర్అండ్‌డి, తయారీ యూనిట్ కృషి చేస్తుందన్నారు



మైక్రోసాఫ్ట్ ఎఐ సారథిగా ముస్తాఫా సులేమాన్

శాన్‌ఫ్రాన్సిస్కో : డీప్‌మైండ్ కోఫౌండర్ ముస్తాఫా సులేమాన్‌ను మైక్రోసాఫ్ట్‌లో చేరారు. మైక్రోసాఫ్ట్ ఎఐ డివిజన్ హెడ్‌గా ఆయన్ను నియమించింది. కాపిలాట్, బింగ్, ఎడ్జ్ లాంటి ప్రోడక్ట్స్‌ను అతనే చూసుకోనున్నాడు. ఇన్‌ఫ్లెక్షన్ ఏఐ స్టార్టప్ సంస్థకు చెందిన కొంత మంది ఉద్యోగుల్ని కూడా మైక్రోసాఫ్ట్ నియమించుకోనున్నది. ఇన్‌ఫ్లెక్షన్ ఎఐ స్టార్టప్‌కు సులేమాన్ ప్రస్తుతం హెడ్‌గా ఉన్నారు. డీప్ మైండ్ అనే ఎఐ సంస్థకు ఆయన కో ఫండింగ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో ప్రఖ్యాతి గాంచిన ఎఐ సంస్థగా డీప్‌మైండ్‌కు గుర్తింపు ఉంది. దీన్ని 2014లో గూగుల్ సంస్థ కొనేసింది.

భువనగిరి పార్లమెంట్ సిపిఎం అభ్యర్థిగా జహంగీర్

- 16 స్థానాల్లో ఎవరికి మద్దతివ్వాలో త్వరలో నిర్ణయం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం సిపిఎం అభ్యర్థిగా ఎండి జహంగీర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం ప్రకటించింది. ప్రజా సమస్యలపై పోరాడే జహంగీర్‌కు మద్దతివ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య నియోజకవర్గ ప్రజలను కోరారు. మూసీ సమస్యను పరిష్కరించాలంటూ జహంగీర్ పాదయాత్ర నిర్వహించారని గుర్తు చేశారు. తెలంగాణలోని మిగతా 16 లోక్‌సభ స్థానాల్లో ఎవరికి మద్దతివ్వాలనే దానిపై ఇంకా కొంత సమయం వేచిచూడాలనీ నిర్ణయించామన్నారు. హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వీరయ్య మాట్లాడుతూ.. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి అధ్యక్షతన జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, సిఎం రేవంత్‌రెడ్డి వంద రోజులపాలన, పార్లమెంటు ఎన్నికలు, పార్టీ వైఖరిపై చర్చించామని వివరించారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేశారనీ, మిగిలిన వాటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాట నిలబెట్టుకుంటుందని ఆశిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరారు. సిఎం దృష్టికి ఈ సమస్యను తెచ్చామనీ, కార్మికుల వేతనాలను పెంచకుండానే డిఎను మూలవేతనంలో కలుపుతూ ఉత్తర్వులిచ్చారని గుర్తు చేశారు. దాంతో కోటి మంది కార్మికులు అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కనీస వేతనాల జీవోలను సవరించాలని డిమాండ్ చేశారు. ధరణి బాధితుల సమస్యను పరిష్కారం కాలేదన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 69 కేంద్రాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని లక్ష కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వారికి రూ.5 లక్షలు ఇచ్చి, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మూసీ సుందరీకరణ చేయడానికి ఎవరికీ అభ్యంతరం లేదనీ, ముందు మూసీ నీటిని శుద్ధి చేయాలని సూచించారు. కులాల ప్రాతిపదికన కార్పొరేషన్ల ఏర్పాటును ఆయన తప్పుబట్టారు. బిజెపిని వ్యతిరేకించే పార్టీలతో జాతీయస్థాయిలో ఇండియా వేదిక ఏర్పడిందని చెప్పారు. రాష్ట్రంలోనూ బిజెపిని ఓడించేందుకు కాంగ్రెస్, సిపిఐలతో కలిసి పనిచేస్తామని స్పష్టంచేశారు. భువనగిరి సిపిఎం అభ్యర్థి జహంగీర్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన సిపిఎం కేంద్ర, రాష్ట్ర కమిటీలకు ధన్యవాదాలు తెలిపారు. విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.

చారిత్రక నవలా చక్రవర్తి 'అడవి బాపిరాజు'

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి-కల్చరల్

వాస్తవిక దృష్టితో నవలా రచనలలో అడవి బాపిరాజు సిద్ధహస్తులని, ఆయన చారిత్రక నవలా చక్రవర్తి అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆయన రచించిన గొన గన్నారెడ్డి, నారాయణరావు నవలలు పరిశోధకులకు ఉప యుక్తమని అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో దశాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా అడవి బాపిరాజు సంస్మరణ సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ బాపిరాజు కవిగా, చిత్రకారుడిగా, శిల్పిగా విభిన్న రంగాల్లో నిపుణులని అన్నారు ఒక వ్యక్తిలో ఇన్ని భిన్న కళా ప్రక్రియలు ఉండడం అరుదని అన్నారు.



సభలో మాట్లాడుతున్న కొలకలూరి ఇనాక్

జాతీయ ఉద్యమంలో అయన పాత్ర విస్మరించలేమని చెప్పారు. గాన సభ అధ్యక్షులు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన సభలో ఘంటసాల గాన సభ అధ్యక్షులు డాక్టర్ కెవి.రావు, ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యులు ఎస్.బి.రామ్, న్యాయవాది తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మారని ఫీల్డ్ అసిస్టెంట్ల బతుకులు

- న్యాయం కోసం రేవంత్ సర్కారువైపు ఎదురుచూపులు
- రెండు పూటలా ఫొటోలనే కేంద్రం మెలికతో ఇబ్బందులు
- బిఆర్ఎస్ పాలనలో మూడేండ్లు తొలగించి ముప్పుతిప్పలు
- బిఆర్ఎస్‌పై కోపంతో కాంగ్రెస్ గెలుపులో కీలకభూమిక
- కొత్తసర్కారు నుమ్మల్ని పట్టించుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం నిర్వహణలో క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలక పాత్ర. అలాంటి వారిని బిఆర్ఎస్ ప్రభుత్వం ముప్పుతిప్పలు పెట్టింది. మూడేళ్లపాటు విధుల నుంచి తొలగించి అరిగోస తీయించింది. 'కాళు మొక్కుతాం విధుల్లోకి తీసుకోండి'అని బతిమాలించుకుంది. ప్రభుత్వంపై ఎక్కడ ప్రజల్లో వ్యతిరేకతను నూరిపోస్తారో అన్న భయంతో అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు విధుల్లోకి తీసుకుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం పని ప్రదేశం నుంచి ఉపాధి హామీ కూలీల ఫొటోలను రోజుకు రెండు సార్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తీసుకొచ్చిన నిబంధన వారికి ప్రాణసంకటంగా మారింది. క్షేత్రస్థాయిలో ప్రజలతో నిత్యం సంబంధ ముండే తమ పట్ల రాష్ట్ర సర్కారు వ్యవహరించిన తీరు.. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని హామీ ఇవ్వడంతో ఫీల్డ్ అసిస్టెంట్లంతా ఒక్కటై కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించేందుకు తమ వంతు ప్రయత్నం చేసి సక్సెస్ అయ్యారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ సర్కారు వచ్చినా ఫీల్డు అసిస్టెంట్లు వ్యథలు మాత్రం మారలేదు. తమ సమస్యలపై ఇప్పటికే ఫీల్డ్ అసిస్టెంట్లు ఎమ్మెల్యేలకు, మంత్రులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. మొన్నటి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు 'మీరు పదేపదే హైదరాబాద్‌కు వచ్చి డబ్బులను వృథా చేసుకోవద్దు. మీ సమస్య మా దృష్టిలో ఉంది. కచ్చితంగా పరిష్కరిస్తాం. అవసరమైతే ఫీల్డు అసిస్టెంట్ల బృందంతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకుని ముందుకెళ్తాం' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తమకు చెప్పిందని పలువురు ఫీల్డు అసిస్టెంట్లు చెప్పారు. ఆ సమావేశాలు అయిపోయి నెల కావస్తున్నా ఇప్పటి వరకూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం విషయంలో ఒక్కడు అడుగు కూడా ముందుకు పడలేదు. రేవంత్‌రెడ్డి సర్కారు తమకు న్యాయం చేస్తుందనే కొండంత ఆశతో ఫీల్డు అసిస్టెంట్లు ఎదురుచూస్తున్నారు.

కేంద్రం తెచ్చిన కొత్త తంటా...

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి ఏటేటా నిధులను తగ్గిస్తూ నిర్వీర్యం చేయడానికి పూనుకుంది. కొత్తకొత్త నిబంధనలు తీసుకొచ్చి కూలీలే పనులకు దూరమయ్యేలా చేస్తుంది. అందులో భాగంగానే ప్రతిరోజూ రెండుపూటలా కూలీల అంటెండెన్స్ ఆన్‌లైన్‌లో ఫేస్ రికగ్నైజ్ ద్వారా తీసుకోవాలనే నిబంధన ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రాణసంకటంగా మారుతున్నది. ఉన్నతాధికారులు కేవలం సిమ్‌కార్డు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. 'సెల్‌ఫోన్‌లో కెమెరా మంచిగా లేకుంటే ఫొటోలు సరిగారావడంలేదు. అటెండెన్స్ పూర్తికాదు. దీంతో అప్పుచేసి రూ.20 వేలు పెట్టి ఫొటోలు బాగా వచ్చే కొత్త ఫోన్ కొన్నాను. ఊర్లల్లో సిగ్నల్ కూడా సరిగా ఉండటం లేదు. నెట్ బ్యాలెన్స్ కూడా మేమే వేయించుకోవాల్సి వస్తున్నది' అంటూ నల్లగొండ జిల్లాకు చెందిన ఓ ఫీల్డ్ అసిస్టెంట్ తన బాధలను పంచుకున్నాడు. 'మా ఊరిలో ఐదారేండ్ల కిందటి దాకా 500 మంది దాకా ఉపాధి పనులకు వచ్చేవారు. ఆ సంఖ్య ఏటేటా తగ్గిపోతున్నది. ఇప్పుడు రోజుకు 50 మంది కూడా రావడం లేదు' అని మహబూబ్‌నగర్ జిల్లాలో భూత్పూర్ మండలానికి చెందిన ఓ ఫీల్డు అసిస్టెంటు ఆవేదన వ్యక్తం చేశాడు. మరోవైపు కూలీలు పనికి రావడం లేదని ఉన్నతాధికారులు ఫీల్డ్ అసిస్టెంట్లను వేధిస్తున్నారు. కూలీల హాజరుశాతాన్ని బట్టి గ్రేడులు విడగొట్టి ఇచ్చే పదివేల రూపాయల్లోనూ తెగ్గోస్తున్నారు.

జీతాలు రాక మూడు నెలలు దాటే..

కూటి కోసం కోటి విద్యలు. ఎవరైనా ఎంతో కొంత జీతం వస్తే దానిపై ఆధారపడి కుటుంబాన్ని నెట్టుకొస్తారు. పొద్దస్తమానం పనిప్రదేశాల చుట్టూ పనులను పర్యవేక్షించడం, కూలీలకు సౌకర్యాలు కల్పించడం, కొలతలు వేయడం, ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయడం వంటి పనులను ఫీల్డ్ అసిస్టెంట్లు మ చేస్తున్నారు. ఇంత పనిచేస్తున్నా వారికి నెలనెలా జీతం రావడం లేదు. రాష్ట్రంలో 7500 మందికిపైగా ఎఫ్ఎలుండగా..వారికి రాష్ట్ర సర్కారు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదు. ఇచ్చే పదివేల రూపాయలు చేతికందకపోవడంతో అప్పులు చేసి బతుకుతున్న దైన్యపరిస్థితి ఉంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పిస్తాం..వేతనాలు పెంచుతాం అని హామీనిచ్చింది. కానీ, అది నేటికీ పట్టాలెక్కలేదు. పైగా, వేతన బకాయిలు కూడా పెండింగ్‌లో ఉంటున్న పరిస్థితి. ఉపాధి హామీ చట్టంలో క్షేత్రస్థాయిలో కూలీలతో పనిచేయిస్తూ రాష్ట్రానికి కేంద్రం నుంచి అధిక నిధులు తెప్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్న తమను రేవంత్‌రెడ్డి సర్కారు ఆదుకోవాలని కోరుతున్నారు.

కార్యాలయాల్లేవు.. సిబ్బంది లేరు

- గందరగోళంగా వైద్యారోగ్య శాఖ జోన్లు
- జిహెచ్ఎంసి ప్రకారం జోన్లుగా విభజన
- అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో తదుపరి ప్రక్రియకు బ్రేక్
- నిలిచిన సిబ్బంది కేటాయింపు
- పెండింగ్‌లో పెట్టిన కొత్త సర్కార్
- 142 జిఒను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న మెడికల్ యూనియన్లు
- ఖైరతాబాద్ డిఎంఅండ్‌హెచ్ ఓకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కూర్చోవడానికి ఆఫీసుల్లేవు. చేయడానికి పని లేదు. పని చేయించుకోవడానికి సిబ్బంది లేరు. పర్యవేక్షణ లేదు. సమస్యలను తెలుసుకోలేరు. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నా వివరాలు ఇవ్వలేరు. తనిఖీ చేయడానికి పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు,బస్తీ దవాఖానాలు లేవు. రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేయడానికి ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబ్స్ లేవు. వచ్చామా? వెళ్లామా? అన్నట్టుగా కేవలం డీఎంఅండ్‌హెచ్ఓ అనే పోస్టుతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది". ఇదీ గ్రేటర్ హైదరాబాద్‌లోని నూతన డిఎంఅండ్‌హెచ్ఒల పరిస్థితి. గత సర్కార్ నిర్లక్ష్యం, ప్రస్తుత సర్కార్ స్పష్టత లేమితో గ్రేటర్ వైద్య, ఆరోగ్యశాఖ విభజన లక్ష్యం నీరుగారిపోతోంది.

గ్రేటర్ హైదరాబాద్‌లో జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని అప్పటి బీఆర్ఎస్ సర్కార్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల



స్థాయిలో ఉన్న వైద్యారోగ్య శాఖను విభజించింది. జిహెచ్ఎంసి పద్ధతి ప్రకారం ఆరు జోన్లుగా ఏర్పాటు చేసింది. మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల రూరల్ పరిధికి మినహాయింపు నిస్తూ.. నూతనంగా ఆరు జోన్లను చేసింది. దేశంలోని ప్రధాన నగరాల్లో కొనసాగిస్తున్న విధానాన్నే తెలంగాణలోనూ అమలు చేసింది. ప్రజలకు వైద్య సేవలు దగ్గరయ్యే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో గత సర్కార్ ఈ నూతన జోన్లకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జోన్‌కు ఒక్కరు చొప్పున ఆరుగురు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను నియమించింది. దాంతో ప్రస్తుత జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు ఒత్తిడి తగ్గి, పర్యవేక్షణ సులభమవుతుందని అప్పటి సర్కార్ భావించింది. కానీ ఆమేరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయకపోవడం.. ఈ లోపు అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో అందుకు అనుగుణంగా అడుగులు పడకపోవడంతో సమస్యలు తలెత్తాయి.

జోన్ల విభజన ఇలా..

హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖను సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లుగా విభజించారు. రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో రూరల్ ప్రాంతాన్ని మినహాయిస్తూ ఎల్బీనగర్, శేరిలింగంపల్లి జోన్లుగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూరల్ ప్రాంతాన్ని మినహాయిస్తూ కూకట్‌పల్లి జోన్‌గా ఏర్పాటు చేశారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి రూరల్ ప్రాంతాలకు ఇది వరకు ఉన్న డీఎఅండ్‌హెచ్ఓలను అలాగే కొనసాగిస్తూ విజభించిన ఆరు జోన్లకు ఆరుగురు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను నియమించారు. గతేడాది జులైలో నూతన జోన్లకు ఆమోదం లభించగా.. అందుకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఒక్కో జోన్‌కు 21 మంది సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. ఆ తర్వాత కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారిపోయాయి. నూతన డీఎంఅండ్‌హెచ్‌లు ఈ విషయాన్ని సర్కార్ దృష్టికి తీసుకెళ్లడంతో కొంత గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. మేజర్ మెడికల్ యూనియన్లతోపాటు, ఐఎన్‌టియుసి (అధికార కాంగ్రెస్) యూనియన్ సైతం ఈ 142 జిఒను మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వచ్చింది. కొత్త సర్కార్ ఏర్పాటు తర్వాత డీహెచ్, ఆయా జిల్లాలోని డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు, నిరసనలు చేసి వినతిపత్రాలు అందజేశారు. కొందరు వ్యతిరేకించడం, కొందరు మద్దతు ఇవ్వడంతో సర్కార్ ఈ జోన్ల ప్రక్రియను పెండింగ్‌లో పెట్టింది.

ఖైరతాబాద్ డిఅండ్‌హెచ్ఒకు అదనపు బాధ్యతలు

జోన్ల విభజన జరిగి సిబ్బంది, ప్రాథమిక కేంద్రాలులేకపోవడంతో నూతన డీఎంఅండ్‌హెచఒలు కేవలం సీటుకే పరిమితమయ్యారు. ఇలా దాదాపు ఎనిమిది నెలలు గడిచింది. ఖైరతాబాద్ డిఎఅండ్‌హెచ్‌గా నియమితులైన పుట్ల శ్రీనివాస్‌కు ఇటీవల సిద్దిపేట డిఅండ్‌హెచ్ఒగా అదనపు బాధ్యతలు కేటాయించగా.. మిగతా ఐదుగురు మాత్రం ఇలాగే ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీరంతా ఏం చేయాలో.. ఎవరితో చెప్పుకోవాలో తెలియక అయోమయంలో పడ్డారు.

సహకారం లభించడం లేదు

ఓ నూతన డీఎంఅండ్‌హెచ్ఓ

జిహెచ్ఎంసిని జోన్లుగా విభజించి నూతన డీఎంఅండ్‌హెచ్ఓలను ఏర్పాటు చేయడం హైదరాబాద్,మేడ్చల్-మల్కాజిగిరి,రంగారెడ్డి జిల్లాల డీఎంఅండ్‌హెచ్ఓలకు లేదు. నెలలు గడుస్తున్నా.. కొత్తవారమైన తమకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు కేటాయించడం లేదు. ప్రయివేటు ఆస్పత్రులు, ల్యాబ్స్ రెన్యువల్స్ బాధ్యతలను కూడా మాకు అప్పగించ లేదు. నాకు దాదాపు 8 నెలలుగా వేతనం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి 142 జీవోపై స్పష్టత ఇవ్వాలి.

ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా వ్యవస్థ నిర్మాణం

- సిఎం దృష్టికి సమస్యలు తీసుకెళతాం : శ్యామ్ మోహన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గత బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను విధ్వంసం చేసిందని పిసిసి మేధావుల కమిటీ చైర్మన్ అనంతుల శ్యామ్ మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్మాణం చేయనుందని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తున్న డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ దోస్త్‌ను రద్దు చేయాలని సిఎంను కోరుతామన్నారు. బుధవారం హైదరబాద్‌లోని గాంధీభవన్‌లో జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల అసోసియేషన్లతో ఆయన సమావేశమయ్యారు. విద్యారంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై పెట్టుబడిని సామాజిక బాధ్యతగా చూస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వ విద్యాసంస్థలతోపాటు గ్రామీణ ప్రయివేటు విద్యాసంస్థలను రక్షించేందుకు కృషి చేస్తామన్నారు. కార్పొరేట్ కళాశాల్లో ఫీజు నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెండింగ్ స్కాలర్‌షిప్పులు, ఫీజురీయింబర్స్‌మెంటు తదితరాంశాలపై సీఎంతో చర్చిస్తామనీ, విద్యారంగ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి పాపిరెడ్డి, తెలంగాణ ప్రయివేట్ జూనియర్, డిగ్రీ కాలేజీ అసోసియషన్ ప్రతినిధులు గౌరీ సతీష్, గౌతమ్, జనార్ధన్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

పండ్లపై రసాయనాలు

- కృత్రిమంగా మామిడి కాయలను మగ్గబెడుతున్న ముఠా అరెస్ట్
- ఆరు చోట్ల తనిఖీలు.. ఐదు కేసులు నమోదు : టాస్క్‌ఫోర్స్ డిసిపి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా, సంపాదనే ధ్యేయంగా రసాయనాలతో మామిడి కాయలను కృత్రిమంగా మగ్గబెడుతున్న వ్యాపారులపై టాస్క్‌ఫోర్సు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ జిహెచ్ఎంసి ఫుడ్‌కంట్రోలర్ అధికారులతో కలిసి సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు నగరంలోని పలుప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో నగరంలో ఆరుచోట్ల తనిఖీలు నిర్వహించిన పోలీసులు ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.12,61,000 విలువగల మామిడి పండ్లతోపాటు వివిధ రసాయనాలు, వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని పాత పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిహెచ్ఎంసి డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్ బాలాజీరాజు, అదనపు డిసిపి శ్రీనివాస్‌రావుతో కలిసి టాస్క్‌ఫోర్సు డిసిపి రేష్మి పెరుమాళ్ నిందితుల వివరాలు తెలిపారు. మంగళ్‌ఘాట్‌కు చెందిన ఇ రామేశ్వర్, ఆసీఫ్‌నగర్‌కు చెందిన ఇర్ఫాన్ ఖాన్, ఆఘాపూర్‌కు చెందిన ఎండీ హుస్సేయిన్, బహద్దూర్‌పురాకు చెందిన సయ్యద్ జహూర్, చార్మినార్‌కు చెందిన సయ్యద్ మాస్తాన్, భవానీ నగర్‌కు చెందిన సయ్యద్ అస్లాం, మొఘల్‌పురాకు చెందిన సయ్యద్ సాదుల్లా నగరంలో పండ్లవ్యాపారం చేస్తున్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పండ్లను తీసుకొచ్చి గోదాముల్లో నిల్వచేస్తున్నారు. కార్బైడ్, ఇథిలీన్‌తో పండ్లను కృత్రిమంగా మగ్గబెడుతున్నారు. రెండు మూడ్రోజుల్లో మగ్గాల్సిన పండ్లు కార్బైడ్, ఇథిలీన్ రసాయనాలతో ఒక్క రోజులోనే మగ్గుతున్నాయి. వాటిని మార్కెట్‌లో సరఫరా చేస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి నగరంలో పలుచోట్ల దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నిందితులను అరెస్టు చేసి వారిపై కేసులు నమోదు చేశారు. నగరంలో మొత్తం 12 గోడౌన్లలో మామిడిపండ్లను కృతిమంగా మాగపెడుతున్నట్టు గుర్తించారు.

వ్యాపారులు సరఫరాదారులు కృత్రిమంగా పండ్లను మగ్గపెట్టొద్దని, రసాయనాలతో పండ్లను మగ్గపెడితే కేసులు నమోదు చేస్తామని డిసిపి హెచ్చరించారు. గతంలో ఇదే తరహాలో రసాయనాలు ఉపయోగించి పండ్లను మగ్గపెట్టినట్టు గుర్తించామని జిహెచ్ఎంసి ఫుడ్‌కంట్రోలర్ బాలాజీరాజు తెలిపారు. రసాయనాలతో పండ్లను మగ్గపెడితే వాటిని తిన్నవారికి ఊపిరితిత్తుల సమస్యలతోపాటు క్యాన్సర్ ప్రబలే ప్రమాదం ఉందని తెలిపారు. వారం రోజుల నుంచి టాస్క్‌ఫోర్సు పోలీసులతో కలిసి నగరంలో హోల్‌సేల్ పండ్ల వ్యాపారులు, గోదాములపై దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యాపారులు దురాశకు పోవద్దని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిబంధనలు పాటించాలని సూచించారు. లేనిపక్షంలో సెక్షన్ 59 ప్రకారం కేసులు నమోదు చేస్తామని, దాంతో జైలు శిక్షతోపాటు రూ. ఐదు లక్షల జరిమానా విధించే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు బి బాలస్వామి, షేక్ జాకీర్ హుస్సేయిన్, నాగరాజు తదితరులు ఉన్నారు.



మెడికవర్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

మెడికవర్ జర్నల్ ఆఫ్ మెడిసిన్ (ఎంజెఎం) జర్నల్‌ను టిఎస్ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ లాంచనంగా ఆవిష్కరించారు. మెడిసిన్ వైద్య పరిజ్ఞానాన్ని, సహకారాన్ని పెంపొందించడంలో ఈ చొరవ ప్రశంసనీయమైనదని సజ్జనార్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో ఆవిష్కరణలు, పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో పరిశోధకులు, కన్సల్టెంట్‌లు, వైద్య విద్యార్థులకు తాజా పురోగతులను అందించడం ఈ జర్నల్ ప్రధాన ఉద్దేశ్యమని మెడికవర్ హాస్పిటల్స్ ఛైర్మన్, ఎండి అనిల్ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమం ఎంజెఎం జర్నల్ డిప్యూటీ ఎడిటర్ డాక్టర్ సతీష్ కుమార్ కైలాసం, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కుమార్ నారాయణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యారోగ్య శాఖలో 5,348 పోస్టుల భర్తీకి పచ్చజెండా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో 5,348 పోస్టుల భర్తీకి సర్కారు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి జీవో విడుదల చేశారు. ప్రజారోగ్యం, ఆయుష్, డిసిఎ, ఐపిఎం, డిఎంఇ, వైద్య విధాన పరిషత్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతులు జారీ చేశారు. వైద్యారోగ్య సర్వీసుల నియామక బోర్డు ద్వారా నేరుగా ఉద్యోగాల భర్తీ చేపట్టాలని జీవోలో సూచించారు. ఇందు కోసం స్థానికత ఆధారంగా ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హతకు సంబంధించిన వివరాలను ఆయా విభాగాల అధిపతుల నుంచి తీసుకోవాలనీ, ఆయా వివరాల ఆధారంగా నోటిఫికేషన్ ఇచ్చి నేరుగా ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి భరోసా ఇచ్చారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పంట నష్టం వివరాలు తెప్పించాలంటూ ఇప్పటికే సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారని గుర్తు చేశారు. ఆ వివరాలు రాగానే పరిహారంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వానాకాలం నుంచి పంటల బీమా అమలు చేస్తామన్నారు. కామారెడ్డిలో ఎక్కువగా పంట నష్టం వాటిల్లిందని వివరించారు. సాధ్యమైనంత వరకు రైతులను ఆదుకుంటామన్నారు. ఇప్పటికే 80 శాతం మంది రైతులకు రైతుబంధు అందిందని చెప్పారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఉద్యోగం పోయిన (ఓడిపోయిన) తర్వాత ఆవేదనతో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

జెఎన్‌టియుహెచ్‌లో విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వసతి గృహాల ఫీజుకు సంబంధం లేకుండా పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతించాలని హైదరాబాద్ కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్ ఇంజినీరింగ్ విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం జెఎన్‌టియుహెచ్‌లోని సిఇఎస్‌టిహెచ్ ప్రిన్సిపాల్ చాంబర్ వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు చల్లా రామకృష్ణ, రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. జెఎన్‌టియూలో పరీక్ష ఫీజులను హాస్టల్ ఫీజులతో ముడిపెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన మెస్ చార్జీలను కూడా విద్యార్థుల దగ్గర నుంచి వసూలు చేయడంతో పేద విద్యార్థుల మీద ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితాలు విడుదల చేసిన మరుసటి రోజు నుంచి లేట్ ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే 3-1 సప్లమెంటరీకి ఆలస్య రుసుమును తొలగించి, 3-2 రెగ్యులర్ ఫీజును హాస్టల్ ఫీజుకు ముడిపెట్టకుండా తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రంజీత్, ఆదిత్య, శివకృష్ణ, బ్రహ్మం, సిద్దార్థ, చరణ్, కార్తీక్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై అధికారులకు ఫోన్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

ధర చెల్లించని మిల్లులను సీజ్ చేయండి

- క్వింటాల్ ధాన్యం రూ.2800కు కొనకపోతే చర్యలు
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశాలు
- మిల్లు వద్ద ఆందోళన చేస్తున్న రైతులకు భరోసా
- అయినా పట్టించుకోని మిల్లర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులు మిల్లుకు తెచ్చిన ధాన్యం క్వింటాలుకు రూ.2800 చెల్లించకపోతే మిల్లులను సీజ్ చేయండని ఆర్అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నల్లగొండ జిల్లా వేముపల్లి మండలంలోని శెట్టిపాలెం సమీపంలో మహర్షి రైస్ మిల్లు వద్ద ధాన్యం కొనుగోలు చేయడంలేదని రైతులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అదే సమయంలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని గూడూరు, వెంకటాద్రిపాలెంలో ఓ కార్యక్రమానికి వెళ్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి రైతుల ఆందోళనను గమనించి వాహనం ఆపి వారితో మాట్లాడారు. మిల్లులు సిండికేట్‌గా మారి ధర చెల్లించడంలేదని కొనుగోలు నిలిపివేశారని రైతులు తెలిపారు. క్వింటాకు రూ.1950 నుంచి 2000 వరకు మాత్రమే ధాన్యానికి ధర చెల్లిస్తున్నారని విన్నవించారు. దాంతో మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. వెంటనే జాయింట్ కలెక్టర్, డిఎస్ఒతో ఫోన్లో మాట్లాడారు. రైతులకు ధర చెల్లించని మిల్లులను వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. రైతులకు రూ. 2000 ధర చెల్లిస్తే నష్టపోతారని, క్వింటా ధాన్యానికి రూ. 2800 చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే మిల్లర్లు ఎఫ్‌సిఐకి ధాన్యాన్ని అందించకుండా అక్రమంగా నిలువ ఉంచుకున్నారని, దీంతోపాటు ధాన్యం కొనుగోలు చేయని, కనీస ధర ఇవ్వని మిల్లులపై కేసు వేయండి అని అధికారులను ఆదేశించారు.

మంత్రి హెచ్చరికలు పట్టించుకోని మిల్లర్స్

రైతులకు రూ.2800 ధర చెల్లించాలని, అన్ని మిల్లులు ధాన్యం కొనుగోలు చేయాలని మంత్రి హెచ్చరించినప్పటికీ మిల్లర్లు పట్టించుకోలేదు. మహర్షి మిల్లు వద్ద రైతులు, అధికారులతో మంత్రి మాట్లాడి వెళ్లిన కొద్దిసేపట్లోనే మిల్లర్లు ధాన్యానికి రూ.2150 మాత్రమే చెల్లించారు. చేసేదేమీలేక రైతులు తక్కువ ధరకే తమ ధాన్యాన్ని అమ్ముకొని వెళ్లిపోయారు. అధికారులు మిల్లుల వద్ద పర్యవేక్షణ చేసి మంచి ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వసూలు చేయాలి .. ఢిల్లీకి పంపాలి

- ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రుల పనితీరు
- రైతులు అన్యాయమవుతున్నా పట్టించుకోవడం లేదు
- సమీక్ష పెట్టి రైతులకు నష్టపరిహారం ప్రకటించాలి
- ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



ఎండిన పొలాలను పరిశీలిస్తున్న జగదీశ్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణాలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు అందినకాడికి వసూలు చేయడం.. ఢిల్లీకి పంపడమే వాళ్ల పని తీరుగా ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వంలో రెండు పర్యాయాలు సాగునీరు ఇచ్చి లక్షలాది ఎకరాలను కాపాడామన్నారు. ఆనాడు ఎస్ఎల్‌బిసి, ఎడమకాల్వ చివరి భూములకూ నీరందించామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి పొలానికైనా నీరు అందని పరిస్థితి ఉందని, రైతులు కన్నీరు పెట్టుకున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. ఈ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే నీరు ఇచ్చి ఆదుకునేవారని చెప్పారు. పంటలు పండితే రైతులకు రూ.500 ఇవ్వాల్సి వస్తుందనే సాకుతోనే నీరు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని, కనీసం జిల్లా మంత్రులకు కూడా సోయి లేకుండా పోయిందని ఆరోపించారు. మంత్రులకు ఇసుక దందా చేయడం, వసూలు చేయడం ఢిల్లీకి పంపడం మాత్రమే తెలుసని విమర్శించారు. ప్రభుత్వం మిల్లులతో కుమ్మక్కై రైతులకు ద్రోహం చేస్తోందని ఆరోపించారు. రైతులను ఆదుకునేందుకు వెంటనే జిల్లా స్థాయిలో వెంటనే సమీక్ష జరిపి నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా.. కనీసం రెండు తడులకైనా నీరు అందిస్తే పంటలు చేతికొచ్చేవని రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జడ్‌పి కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌ఆలీ, నాయకులు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మట్టపల్లి సైదులు యాదవ్, హాతీరాంనాయక్ ఉన్నారు.

పంట నష్టం ఎకరాకు రూ.10 వేలు చెల్లించాలి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలతో పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వడగండ్లవాన, అకాల వర్షాలతో పంటలు పోయి రైతులు బాధలో ఉంటే ఒక్క మంత్రి కూడా వారికి భరోసా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది అకాల వర్షాల వల్ల వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతింటే తమ ప్రభుత్వం ఎకరాకు రూ.10 చెల్లించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది అదిలాబాద్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయనీ, లందువల్ల రాజకీయాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రెండు నెలలు గడుస్తున్నా రైతులకు రైతు బంధు జమచేయని రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మాత్రం టంఛన్‌గా బిల్లులు చెల్లిస్తోందని ఆరోపించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాతంలో వ్యవహరిస్తోందని విమర్శించారు.



నగరంలో స్టార్లా జ్యువెల్స్ తొలి స్టోర్

ప్రజాశక్తి - హైదరాబాద్

నగరంలో తమ తొలి స్టోర్‌ను ఘనంగా ప్రారంభించినట్లు స్టార్లా జ్యువెల్స్ తెలిపింది. జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌ను సినీ నటీ రీతూ వర్మ లాంచనంగా ప్రారంభించారు. "వివేకవంతులైన కొనుగోలుదారులందరికీ అందుబాటులో ఉండేటటువంటి ఎంపికలు, అద్భుతమైన నైపుణ్యాన్ని అందించడానికి స్టార్లా జ్యువెల్స్ అంకితం చేయబడింది. నాణ్యత, చక్కదనం విషయంలో రాజీపడకుండా తమ సరసమైన ఉత్పత్తులను అందించటంపై మేము గర్విస్తున్నాము. ఏదైనా ముఖ్యమైన సందర్భాన్ని గుర్తించడానికి ఖర్చు ఎప్పుడూ అడ్డంకిగా ఉండదని నిరూపించడానికి మేము ఎదురుచూస్తున్నాము" అని స్టార్లా జ్యువెల్స్ సహ వ్యవస్థాపకురాలు జ్యోత్స్న పన్నాల పేర్కొన్నారు.



జెఎస్‌డబ్ల్యు, ఎస్ఎఐసి జట్టు

- ఆటోమోటివ్ కంపెనీ ఏర్పాటు

ముంబయి : ఎస్ఎఐసి మోటార్, జెఎస్‌డబ్ల్యు గ్రూపు కొత్త వ్యాపార భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. నూతన జాయింట్ వెంచర్‌లో భాగంగా జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియాను ఏర్పాటు చేశాయి. దీంతో భారత ఆటోమొబైల్ రంగంలోని విస్తృత అవకాశాలను ఉపయోగించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కొత్త భాగస్వామ్యంలో వచ్చే ప్రతీ మూడు నుంచి ఆరు మాసాల్లో ఒక్క కొత్త వాహనాన్ని విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ స్టీరింగ్ కమిటీ మెంబర్ పార్త్ జిందాల్ తెలిపారు. ఐదేళ్లలోనే దేశంలో ఎంజి బ్రాండ్‌ను గొప్ప స్థాయికి తీసుకెళ్లామని ఎంజి మోటార్ ఇండియా సిఇఒ రాజీవ్ చాబా పేర్కొన్నారు.

రైతులకు నీరందించలేని వరప్రదాయిని!

- కడెం ప్రాజెక్టుకు క్రాప్ హాలిడే ప్రకటించిన అధికారులు.!
- ప్రాజెక్టులో ప్రస్తుతం 2.96 టిఎంసిలే నీటి నిల్వ
- వరదలు వచ్చినా ఫలితం లేని పరిస్థితి
- సాగులోకి రాని పంటలు.. బీళ్లుగా మారిన పొలాలు
- బిజెపి ఎంపి గెలిచినా ప్రాజెక్టు అభివృద్ధికి నిధులివ్వని కేంద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులకు వరప్రదాయినిగా ఉన్న కడెం ప్రాజెక్టు.. నేడు రైతులకు నీరందించలేని దుస్థితికి చేరింది. ప్రతి ఏటా రెండు పంటలకు సరిపడా నీరందిస్తూ.. కర్షకులకు తోడుగా నిలిచే ఈ ప్రాజెక్టు దయనీయ స్థితికి చేరింది. దీనకంతటికీ పాలకులు.. అధికారుల నిర్లక్ష్యమే కారణం. కుండపోత వర్షం, భారీగా వరద వచ్చి ప్రాజెక్టులో నిలిచినా ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు గత ప్రభుత్వంలో అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో కిందికిపోవాల్సి వచ్చింది. నీరంతా వర్షాకాలంలోనే వెళ్లిపోవడంతో ప్రస్తుత యాసంగి పంటలకు నీరందించలేని దుస్థితిలో కడెం ప్రాజెక్టు ఉంది. చివరికి పంటలు వేయొద్దని అధికారులు ప్రకటించాల్సి వచ్చింది. కడెం ప్రాజెక్టుకే క్రాప్ హాలిడే ప్రకటించారు.. ప్రాజెక్టు ఉన్నా నీరు లేకపోవడంతో వేలాది ఎకరాలు బీళ్లుగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 2.96 టిఎంసి (శతకోటి ఘనపుటడుగులు) మాత్రమే నీరు నిల్వ ఉండటంతో కాల్వల ద్వారా నీటి సరఫరా నిలిపివేశారు. కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి ఈ దుస్థితిని చూడాల్సి వచ్చిందని అన్నదాతలు వాపోతున్నారు. ఈ ప్రాజెక్టు ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో ఉంది. ఇక్కడ నుంచి గతంలో ఆదిలాబాద్ ఎంపిగా బిజెపి గెలిచినా ప్రాజెక్టు అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వరద వచ్చినప్పుడల్లా టెక్నికల్ అధికారులు కేంద్రం నుంచి వచ్చి ప్రాజెక్టును చూసి పోతున్నారు తప్ప ..నిధుల కేటాయింపు శూన్యమే.

నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు ప్రకృతి అందాలకే పరిమితం కాకుండా.. అన్నదాతలకు కల్పతరువుగా ఉన్న ఈ ప్రాజెక్టు ఇది. 1955 ఏడాదిలో 7.60 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు అన్నదాతలకు వర ప్రదాయనిగా మారింది. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద 68,500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్‌లో సుమారు 50 వేల ఎకరాల్లో పంటలు సాగుచేస్తుంటారు. రబీ సీజన్‌లో 35వేల ఎకరాల్లో పంటలకు నీరందిస్తుంది. కానీ గత వర్షాకాలంలో సంభవించిన వరదల కారణంగా ప్రాజెక్టు పరిస్థితి ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. అధిక వర్షాల కారణంగా ఏకంగా 60 టిఎంసిల నీరు ఈ ప్రాజెక్టులోకి పోటెత్తడంతో ఈ ప్రభావానికి గేట్లు తట్టుకోలేకపోయాయి. పాత గేట్లు కావడంతో తెరుచుకోలేకపోవడం.. రూప్ తాడు తెగిపోయి కౌంటర్ వెయిట్‌లు కొట్టుకుపోయాయి. మరో రెండు మూడుగేట్లు తెరుచుకోలేదు. ఒకవైపు వరద పోటెత్తడం.. మరోవైపు గేట్లు మొరాయించడం కారణంగా ప్రాజెక్టు మనుగడపై భయాందోళన రేకెత్తించింది. పరిసర గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇరిగేషన్ అధికారులు ఏకంగా 50 టిఎంసిలటీ నీటిని కిందకు వదిలిపెట్టారు.



గేట్లు తెరుచుకోకపోవడం.. మరమ్మతులు చేయించని కారణంగా ప్రాజెక్టులో నీరంతా కిందకు వెళ్లిపోయింది. ఫలితంగా డెడ్ స్టోరేజీకి వెళ్లిపోయింది. దీనిని పరిశీలించేందుకు కేంద్రం నుంచి కూడా టెక్నికల్ బృందమూ వచ్చింది. ఆనాటి వరదను చూసి కేంద్రమూ చలించిపోయింది. ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయి.

బీళ్లుగా మారిన పొలాలు

ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 7.60 టిఎంసిలు కాగా.. ఖరీఫ్ పంటలకు సాగునీరందించగా.. ప్రతి ఏటా రబీ సాగు కోసం నాలుగు టిఎంసిల నీటిని నిల్వ చేస్తుంటారు. ఈ ప్రాజెక్టు ఆయకట్టు కింద కుడి, ఎడమ కాల్వల ద్వారా యాసంగి సీజన్‌లో వరి, మెట్ట పంటలు సుమారు 35 వేల ఎకరాలకు సాగునీరందిస్తారు. కానీ వరద నీరంతా కిందకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం 2.96 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉంది. ఈ నీటితో రబీ పంటలకు సాగునీరందించడం సాధ్యమయ్యే పరిస్థితి లేకపోవడంతో అధికారులు తాజాగా క్రాప్ హాలిడే ప్రకటించారు. దీంతో ఈ ఏడాది రబీలో 35 వేల ఎకరాలు బీళ్లుగా మారాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి ఇలాంటి పరిస్థితి వచ్చిందని స్థానికులు, పరిసర గ్రామాల్లోని రైతులు చెబుతున్నారు. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించాలని అధికారులు అప్పటి పాలకులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని చెబుతున్నారు.